క్లుప్తంగా

నాదనీరాజనం వేదికపై అన్నమయ్య సంకీర్తనలు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నాదనీరాజనం వేదికపై ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు రాణి శ్రీనివాసశర్మ బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తిభావాన్ని పంచాయి. రాణి శ్రీనివాసశర్మ నేతృత్వంలో 'అన్నమయ్య సంకీర్తన సుమమాలిక' పేరుతో అన్నమయ్య సంకీర్తనలను స్వరపరిచి రికార్డు చేశారు. ప్రస్తుతం మరికొందరు కళాకారులతో కలిసి ఈ సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించారు. ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు రంగస్థలి ప్రసాదాలు

తిరుపతి కల్చరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీసరస్వతీదేవి అలంకరణలో కొలువైన గంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులకు శుక్రవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఉచితంగా ప్రసాదాలు వితరణ చేశారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజా, మునికృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, వాసుస్వామి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం దసరా కానుక

తిరుపతి తుడా: రాష్ట్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరణ చట్టం గెజిట్‌ను విడుదల చేసి, ప్రభుత్వం దసరా కానుకను అందించిందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా చైర్మన్ రాజా ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ఇటీవల మంత్రి మండలి నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆ మేరకు ప్రభుత్వం శుక్రవారం క్రమబద్ధీకరణ చట్టం గెజిట్‌ను విడుదల చేయడం శుభ పరిణామం అన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దినేష్ కుమార్

తిరుపతి తుడా: భవాని నగర్‌లోని శ్రీదినేష్ కల్పన ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. 200 మందికిపైగా ఎముక సాంద్రత పరీక్షలునిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు పైబడిన వారు తరచూ ఎముకల పటిష్టతను పరీక్షించుకోవాలన్నారు. ఉదయం 6–7 గంటల మధ్య ఎండలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ కల్పన, డాక్టర్ కీర్తి, డాక్టర్ చరిత, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసరస్వతీదేవిగా గంగమ్మ



తిరుపతి కల్చరల్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఐదో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీసరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ పాల్గొన్నారు.

శ్రీసరస్వతి అలంకరణలో శ్రీమూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు శుక్రవారం సాయంత్రం శ్రీసరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వాహన సేవల్లో
కళా వైభవం

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం వాహన సేవ వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు అద్భుతంగా ప్రదర్శనలిచ్చాయి. 12 కళా బృందాల్లో 305 మంది కళాకారులు పాల్గొన్నాయి. మహారాష్ట్ర థానే సెల్వరాజ్ బృందం గోందల్ నాట్య విన్యాసం అలరించింది. ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థుల శ్రీరామ పట్టాభిషేకం కనువిందు చేసింది. తణుకు ఎస్.రాధిక నృత్య ప్రదర్శన, తూర్పు గోదావరి నిడదవోలు ఎస్.సరస్వతి బృందం డ్రమ్ముల నృత్యం, కర్ణాటక జ్యోతి ఎస్.హెగ్డే దాస సంకీర్తన నృత్యం, విశాఖపట్నం డీవీఎల్ శిరీష బృందం కోలాటం, రాజమండ్రి డి.గాయత్రి బృందం గోపికా కృష్ణుల నృత్యం అలరించాయి.


హనుమంత వాహనంపై తిరుమల శ్రీవారి వైభవం


కళాకారుల విన్యాసం


గజ వాహన సేవలో కళారూపాల ప్రదర్శన





పెన్షనర్ల సంఘం నేతలకు సన్మానం


ఎన్షనర్ సంఘం ప్రతినిధులను సత్కరిస్తున్న హనీ ఫ్రెండ్స్ సంస్థ సభ్యులు

పాకాల: పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాం నాయుడు, ఆ సంఘం పాకాల యూనిట్ ప్రధాన కార్యదర్శి కుప్పుస్వామి నాయుడులను హనీ ఫ్రెండ్స్ గ్రూప్ సంస్థ వారు ఘనంగా సత్కరించారు. శుక్రవారం మండలంలోని పెద్దగోర్పాడు వద్ద ఉన్న అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు ప్లేట్లు, గ్లాసులు, దుస్తులు వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, వృద్ధుల నుంచి ఆశీర్వాదాన్ని పొందారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తూ పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన జయరాం నాయుడికి, కుప్పుస్వామి నాయుడికి శాలువా కప్పి, పూల మాల వేసి సత్కరించారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా జగనన్న సురక్ష


గర్భవతికి సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు భరోసా కల్పిస్తూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్యాంప్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. చివరగా గర్భవతికి సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, ఆమెకు పౌష్టికాహారాన్ని అందజేశారు. సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ టి.పవన్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష.. జగనన్న సురక్ష

చంద్రగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఆరోగ్య రక్షగా నిలుస్తోందని కొటాల సర్పంచ్ గంగులమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొటాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు క్యాంపు వద్దకు చేరుకుని ఉచిత వైద్యసేవలను వినియోగించుకున్నారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు.ఎంపీడీఓ రమేష్‌బాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఎంపీటీసీ మధు, నాయకులు మురళీ నాయుడు, మునికృష్ణ, విరుపాక్షి ప్రసాద్ రెడ్డి, సెక్రటరీ మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధులకు కంటి అద్దాల పంపిణీ

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

భాకరాపేట: ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జంగావాండ్లపల్లె సర్పంచ్ సింహాల విమల అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జంగావాండ్లపల్లె సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈవో పీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటమోహన్‌రెడ్డి, నాగమణి, వైద్యులు తేజశ్రీ, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాపవినాశనం దుకాణదారులకు అటవీశాఖ హెచ్చరికలు

తిరుమల: పాపవినాశనంలో ప్రకృతి పరిరక్షణకు ఏపీ అటవీ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అటవీ శాఖ పాపవినాశనంలోని షికారీలు, ఇతర దుకాణదారులకు హెచ్చరికలు జారీచేసింది. ఉదయం 7 గంటల తరువాత మాత్రమే పాపవినాశనంలో దుకాణాలు తెరవాలని, సాయంత్రం 5 గంటలకు మూసివేయాలన్నారు. దుకాణాలు మూసిన తరువాత అక్కడ ఉండరాదన్నారు. దుకాణాల్లో పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు అమ్మరాదని ఆదేశించారు. ప్లాస్టిక్ బాటిల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు నిషిద్ధమని తెలిపారు. కొత్త దుకాణాలు ఏర్పాటు చేయరాదని, ఆహార వ్యర్థాలను చెత్తకుండీలలోనే వేయాలని, రోడ్డుపక్కన వేయరాదని ఆదేశించారు.

అన్నదానం విభాగానికి రూ.2 లక్షలు విలువైన కూరగాయలు

తిరుమల: అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం టీటీడీ అన్నప్రసాదం విభాగానికి 9.5 టన్నుల బరువు గల రూ.2 లక్షలు విలువైన కూరగాయలను విరాళంగా అందించారు. ఈ కూరగాయలను తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అధికారులకు అందజేశారు.


కూరగాయలు విరాళంగా ఇచ్చిన దాతలు

ఏఆర్ఎంఓగా డాక్టర్ హరికృష్ణ

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రి అసిస్టెంట్ ఆర్ఎంఓగా డాక్టర్ హరికృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో రుయా ఏఆర్ఎంఓగా పనిచేస్తూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా ఆయన బదిలీ అయ్యారు. రెండు నెలలపాటు ప్రజా ఆరోగ్య అధికారిగా పనిచేసిన ఆయన సెలవులో ఉన్నారు. సెలవులు ముగియడంతో తిరిగి రుయా ఏఆర్ఎంఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, రుయా ఏడీ రత్నరాజు, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


డాక్టర్ హరికృష్ణను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా

హ్యాపీ మొబైల్స్‌లో దసరా ప్రత్యేక ఆఫర్లు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య సర్కిల్ వద్ద నూతనంగా ప్రారంభించిన హ్యాపీ మొబైల్స్ రెండో బ్రాంచ్‌లో ప్రతి మొబైల్ కొనుగోలుపై దసరా ప్రత్యేక ఆఫర్లు కల్పిస్తున్నట్లు హ్యాపీ మొబైల్స్ చైర్మన్, ఎండీ కృష్ణ పవన్ తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.10,000 పైగా మొబైల్స్ కొనుగోళ్లపై ఎల్ఈడీ టీవీలు, ట్రావెల్ సూట్‌కేస్‌ల బహుమతులతోపాటు ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కొన్నిమొబైల్స్‌పై 65 శాతం తగ్గింపు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. తమ షోరూంలో 300 పైగా మోడల్స్, 500 రకాల యాక్సరీస్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆఫర్ల కోసం 9100412345 నెంబర్‌లో సంప్రదించాలని తెలియజేశారు.


హ్యాపీ మొబైల్స్ అధినేత కృష్ణ పవన్

స్టేట్ రెఫరల్‌గా స్విమ్స్ మైక్రో బయాలజీ ల్యాబ్


స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్ లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి, ఇతర అధికారులు

తిరుపతి తుడా: స్విమ్స్ మైక్రో బయాలజీ ల్యాబ్ను యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నియంత్రణ కోసం స్టేట్ రెఫరెల్ ల్యాబ్‌గా ప్రతిపాదిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ అనూజ్ శర్మ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం స్విమ్స్ మైక్రో బయాలజీ పరిధిలోని ల్యాబ్‌ను నిపుణులు సందర్శించారు. ల్యాబ్ సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యధిక వైద్య పరికరాలు ఉన్నాయని అభినందించారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రతినిధులు జే నివాస్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.మోహన్ కృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరమణ, ప్రొఫెసర్ డాక్టర్ జయప్రద, వైరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉష కళావత్, తదితరులు ల్యాబ్ను పరిశీలించిన వారిలో ఉన్నారు.






శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలతో తుమ్మలగుంట ఆధ్యాత్మిక భావంతో అలరారుతోంది. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సాగుతున్న కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం హనుమంత, గజ వాహనాలపై స్వామివారు ఊరేగారు. - తిరుపతి రూరల్

తిరుమలలో నేటి వాహనాలు

సూర్యప్రభ వాహనం

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు ఉదయం సూర్యప్రభ వాహన ఊరేగింపు నిర్వహిస్తారు. సప్త అశ్వాలపై అనుడు రథసారధిగా ఎర్రటి పూలమాలలు ధరించి స్వామివారు ఈ వాహనంపై ఊరేగుతారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్య భగవానుడికి తానే ప్రతిరూపం అని స్వామివారు ఈ వాహనం మీద భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తారు.

చంద్రప్రభవాహనం

ఏడోరోజు రాత్రి తెల్లటి వస్త్రాలు, పువ్వుల మాలలు ధరించి చల్లని వాతావరణంలో తిరువీధుల్లో స్వామివారు చంద్ర ప్రభ వాహనం మీద విహరిస్తారు. సూర్యుడి తీక్షణం, చంద్రుని శీతలత్వం రెండూ తన అంశమేనని స్వామివారు ఈ వాహనాల ద్వారా తెలియజేస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తారు.

మెకానిక్స్‌కు ఉచిత దంత వైద్యం


ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: స్టార్ డెంటల్ ఆసుపత్రి బృందం ఆధ్వర్యంలో యూత్ హాస్టల్లో టూవీలర్ మెకానిక్స్‌కి శుక్రవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. శ్రీబాలాజీ వెల్ఫేర్ టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నెలవారీ సమావేశంలో భాగంగా ఈ ఉచిత దంతవైద్య శిబిరం చేపట్టారు. ప్రముఖ రూట్ కెనాల్ స్పెషలిస్ట్ డాక్టర్ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో 120 మంది సభ్యులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ 80 మందికి లక్ష రూపాయల చొప్పున బ్యాంక్ ఖాతాలో ఇన్సూరెన్స్ కల్పించినట్లు తెలిపారు. అసోసియేషన్ నేతలు బాబురావు, అంజిత్‌భాషా పాల్గొన్నారు.

'శ్రీజ'కు ప్రత్యేక అవార్డు


అవార్డును అందుకుంటున్న శ్రీజ సంస్థ చైర్ పర్సన్ శ్రీదేవి

తిరుపతి కల్చరల్: శ్రీజ మిల్క్ సంస్థకు అమెరికా వారి ప్రత్యేక అవార్డు లభించింది. ఈమేరకు అమెరికాలోని చికాగోలో 19న వరల్డ్ డెయిరీ సమ్మిట్ నిర్వహించారు. మహిళా సాధికారతలో ఇన్నోవేషన్ అనే విభాగంలో ఉత్తమ ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో మొత్తం 173 దేశాల నుంచి కంపెనీలు పోటీ పడ్డాయి. ఇందులో శ్రీజ సంస్థ ఎన్‌డీడీబీ డెయిరీ సర్వీసెస్ ద్వారా నామినేట్ అయ్యింది. శ్రీజ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, లక్ష్యాలను గుర్తించి అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును ఎన్‌డీడీబీ డెయిరీ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ మీనేష్, భారతదేశ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ చేతులమీదుగా శ్రీజ కంపెనీ చైర్ పర్సన్ కె.శ్రీదేవి అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డు 1.20లక్షల మంది మహిళా పాడిరైతులు, వారి కుటుంబాలకు అంకితమన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి నగరంలోని వివిధ వేదికలపై కళాకారులు ప్రదర్శించిన సంగీత, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరామచంద్ర పుష్కరిణి కళా వేదికపై పవన్‌కుమార్ బృందం ప్రదర్శించిన జానపద కళ తోలు బొమ్మలాట భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహతి కళాక్షేత్రంలో శ్రీశ్రావ్య సుమధుర ఆర్ట్స్ కళా బృందం ప్రదర్శించిన నృత్య రూపకం నయనానందకరంగా సాగింది. అన్నమాచార్య కళామందిరంలో వాయునందన్ బ్రదర్స్ వాయిద్య సంగీత కచేరి సభికులను రంజింపజేసింది.


రామచంద్ర పుష్కరిణి వేదికపై తోలు బొమ్మలాట


మహతి కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శన



